## 'చీట్'ఫండ్, వ్యాపారాల పేరిట..

కామారెడ్డి కేంద్రంగా వెలిసిన చిట్‌ఫండ్ సంస్థలు సైతం ప్రజల నుంచి డబ్బులు సేకరించి బోర్డు తిప్పేశాయి. గతంలో వీక్లీ మార్కెట్‌లో ఎస్‌వీ కట్‌మీట్ షాపు యజమాని రూ.1.50 కోట్ల వరకు అప్పులు చేసి రాత్రికి రాత్రి ఉడాయించాడు. అంబికా కిరాణ షాపు ఓనర్ రూ.కోటిగా పైగా ముంచి పరారయ్యాడు. ఇటీవల హబీబ్ అనే వ్యక్తి సైతం ఇలాగే అమాయకులను ముంచాడు. బస్టాండ్ సమీపంలో మెగా మార్ట్ సూపర్ మార్కెట్‌తో పాటు వడ్డీ వ్యాపారం పేరిట రూ.2 కోట్ల దాకా అప్పులు చేసి మాయమయ్యాడు. 40 రోజులుగా షాపు తెరువక పోవడం, హబీబ్ అడ్రస్ లేకపోవడంతో మోసపోయిన బాధితులు షాపు ముందర ధర్నాకు దిగారు. ఇలాంటి ఉదంతాలెన్నో కామారెడ్డి కేంద్రంగా చాలా ఉన్నాయి.




కామారెడ్డి పట్టణంలో మూసిఉన్న కొత్త బస్టాండ్ సమీపంలోని మెగా సూపర్ మార్కెట్ వద్ద గుమిగూడిన బాధితులు (ఫైల్)




మూసి ఉన్న మెగా సూపర్ మార్కెట్

# నమ్మించి.. వంచించి

- అమాయకులకు కుచ్చుటోపీ
- అప్పులు చేసి పరారవుతున్న వ్యాపారులు
- కామారెడ్డిలో తరచూ ఘటనలు
- ఇటీవల మరో వ్యాపారి పరారీ
- ఐపీ పేరిట టోపీ పెడుతున్న మోసగాళ్లు
- లబోదిబోమంటున్న బాధితులు
- ఏండ్లు గడిచినా దక్కని న్యాయం

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : వ్యాపారాల పేరుతో కొందరు కేటుగాళ్లు భారీగా అప్పులు చేసి ఆ తర్వాత బోర్డు తిప్పేస్తున్నారు. అమాయక ప్రజలను నమ్మించి డబ్బులు తీసుకుని ఉడాయిస్తున్నారు. దివాళా తీశామంటూ ఐపీ పెట్టి జనానికి కుచ్చుటోపీ పెడుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. అప్పులు ఎగ్గొట్టి పరారవుతున్న ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. కడుపు మాడ్చుకుని, కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో మోసగాళ్లు ఉడాయిస్తుండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

### రూ.కోట్లు కొల్లగొట్టి..

కామారెడ్డి జిల్లాలో తరచూ మోసాలు వెలుగు చూస్తున్నాయి. ప్రధానంగా కామారెడ్డి పట్టణంలోనే ఇలాంటివి ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. అమాయకులను ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు భారీగా దండుకుని ఉడాయిస్తున్నారు. దందాల పేరిట నమ్మించి, అధిక వడ్డీ ఆశ చూపి ఆ తర్వాత బోర్డు తిప్పేస్తున్నారు. స్థానికంగా ఉంటూ నమ్మకం కల్పించి జనం నుంచి రూ.కోట్లలో డబ్బులు తీసుకుని పరారవుతున్నారు. బీర్‌షేబా సంస్థ మొదలుకుని ఎన్నో చిట్‌ఫండ్ సంస్థలు, ఎంతో మంది వ్యాపారులు ఇలా అమాయకులను బురిడీ కొట్టించారు.




**కష్టపడి.. కడుపు మాడ్చుకుని..**

పలు సంస్థలు, వ్యాపారులు ఎరవేసే వడ్డీకి ఆశపడి అమాయకులు మోసపోతున్నారు. ఎంతో కొంత కలిసొస్తుందన్న ఆశతో డబ్బులు ఇచ్చి చేతులు కాల్చుకుంటున్నారు. అప్పు చెల్లించాలని వ్యాపారులపై కాస్త ఒత్తిడి తెస్తే బెదిరింపులు ఎదురవుతుండడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్ము, కడుపు మాడ్చుకుని రూపాయి రూపాయి పోగేసుకున్న డబ్బు మోసగాళ్ల పాలు కావడంతో భరించలేక పోతున్నారు. వడ్డీ కలిసొస్తుందన్న ఆశకు పోతే అసలుకే ఎసరు వస్తుండడంతో లబోదిబోమంటున్నారు. మరోవైపు, బాధితులు పోలీసుల చుట్టూ తిరుగుతున్నా వారికి న్యాయం దక్కడం లేదు. దివాళా తీశామంటూ కేటుగాళ్లు ఇన్‌సాల్వేన్సీ పిటిషన్ (ఐపీ) వేస్తుండడంతో బాధితులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

### బీర్‌షేబా @ రూ.200 కోట్లు..

కామారెడ్డి కేంద్రంగా జరిగిన మోసాల్లో మొదటి స్థానంలో నిలిచేది బీర్‌షేబా సంస్థ. జిల్లా కేంద్రంలోని స్నేహపురి కాలనీలో బీర్‌షేబా పేరుతో ఓ సంస్థను నెలకొల్పారు. రూ.30 వేలు కడితే నెలకు రూ.10 వేల చొప్పున పది నెలల్లో రూ.లక్ష ఇస్తామని నమ్మించారు. ఇందుకోసం స్థానికులనే ఏజెంట్లుగా పెట్టుకున్నారు. తెలిసిన వారే కావడంతో కామారెడ్డితో పాటు చుట్టుపక్కల మండలాల్లో చాలా మంది వారిని నమ్మి పెట్టుబడి పెట్టారు. మొదట్లో ఒకటి, రెండు నెలలు రూ.10 వేల చొప్పున నిర్వాహకులు చెల్లించడంతో జనంలో నమ్మకం కలిగింది.దీంతో దవాఖానల ఖర్చు కోసం, పిల్లల చదువుల కోసం, బిడ్డల పెండ్లిల కోసం దాచుకున్న డబ్బులు సైతం వారికి ముట్టజెప్పారు. కామారెడ్డి జిల్లా సహా పలు జిల్లాల్లో 20 వేల మంది సుమారు రూ.200 కోట్ల దాకా పెట్టుబడి పెట్టారు. భారీగా డబ్బులు సేకరించిన బీర్‌షేబా నిర్వాహకులు బిచాణా ఎత్తేశారు. విషయం తెలిసి బాధితులు లబోదిబోమంటూ ఠాణాల చుట్టూ తిరిగాల్సి వచ్చింది. పోలీసులు నిర్వాహకులను అరెస్టు చేసినప్పటికీ, బెయిల్ పొంది హైదరాబాద్‌కు మకాం మార్చారు. నాలుగేండ్లు దాటుతున్నా బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదు.

### అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి పట్టణంలో చాలా మంది వ్యాపారులు ప్రజలను నమ్మబలికి డబ్బులు దండుకుంటున్నారు. పెట్టిన దానికి రెట్టింపు వస్తాయని నమ్మబలికి జనం సొమ్ముతో ఉడాయిస్తున్నారు. ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తేరగా డబ్బులు వస్తాయని అనుమతి లేని సంస్థలో డబ్బులు పెట్టడం, మిత్తీ ఎక్కువ వస్తుందని అప్పుగా ఇవ్వడం మానుకోవాలి.

**- చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ, కామారెడ్డి**

## బై బ్యాక్ పేరిట.. సీడ్ ఆర్గనైజర్ మోసం!

- తీవ్రంగా నష్టపోయిన కౌలు రైతు
- చేతులెత్తేసిన ఏజెంట్



కౌలు రైతు జోరిగె నవీన్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 20: బై బ్యాక్ ఒప్పందంతో మక్కజొన్న సాగుచేసిన కౌలు రైతును సీడ్ ఆర్గనైజర్ నిండాముంచిన ఘటన ఆర్మూర్ మండలంలో చేపూర్ గ్రామంలో వెలుగుచూసింది. సీడ్ ఆర్గనైజర్ అయిన ఏలేటి జగన్‌రెడ్డి మక్కజొన్న సీడ్ పంటను సాగు చేయడానికి చేపూర్ గ్రామానికి చెందిన జోరిగె నవీన్‌తో ఒప్పందం చేసుకున్నాడు. క్వింటాలుకు రూ. 3,500 చెల్లిస్తానని లిఖితపూర్వకంగా రాసిచ్చాడు. దీంతో నవీన్ మూడెకరాలు కౌలుకు తీసుకొని పంట సాగు చేశాడు. బైబ్యాక్ ఒప్పందం ప్రకారం పంటను కొనుగోలు చేయాల్సి ఉండగా.. సదరు సీడ్ ఆర్గనైజర్ ప్రస్తుతం ముఖం చాటేశాడు. దీంతో పంటను అమ్ముకోలేక, కౌలు డబ్బులు చెల్లించలేక తాను తీవ్రంగా నష్టపోతున్నట్లు కౌలు రైతు నవీన్ ఆవేదన వ్యక్తం చేశాడు. కౌలు రైతు, సీడ్ ఆర్గనైజర్‌కు మధ్యవర్తిగా వ్యవహరించిన చేపూర్ గ్రామానికి చెందిన గోపిడి నర్సారెడ్డి సైతం పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఈ విషయమై అధికారులు చొరవ తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

## రేవంత్‌రెడ్డి అచ్చినప్పటి నుంచి రైతు భరోసా రాలే..

- ఎకరం భూమి ఉన్నా ఇయ్యలే..
- కేసీఆర్ సార్ ఉన్నప్పుడు వస్తుండే..
- కంటతడి పెట్టిన ఓ మహిళ వీడియో వైరల్



వేల్పూర్ మండల కేంద్రంలో మాట్లాడుతున్న మహిళ

వేల్పూర్, ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తనకు రైతుభరోసా రావడంలేదని ఓ మహిళా రైతు ఆవేదన వ్యక్తంచేసింది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు వచ్చేదని, ఇప్పుడు రేవంత్ సర్కార్ ఇవ్వడంలేదని భీమ్‌గల్ మండలం రహత్‌నగర్‌కు చెందిన గుగూలోత్ భీక్రీ అనే మహిళా రైతు కంటతడి పెట్టింది. రహత్‌నగర్‌కు చెందిన ఆమె కూలిపని కోసం వేల్పూర్ మండల కేంద్రానికి రాగా.. స్థానికులు పలుకరించగా తన బాధను వివరించింది. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతు భరోసా ఇవ్వడం లేదని, తనకు ఎకరం భూమి ఉన్నా రావడంలేదని తెలిపింది. తనకు నలుగురు కొడుకులున్నా తన గోసను ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేసింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం అందిస్తే, రేవంత్ రెడ్డి వచ్చినప్పటి నుంచి అందడం లేదని కంటతడిపెట్టడం స్థానికులను కలిచివేయగా..ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## మొరం తవ్వకాలు నిలిపివేత

- ఫత్తేనగర్, ఫకీరాబాద్ చెరువుల్లో తవ్వకాలకు బ్రేక్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నవీపేట, ఫిబ్రవరి 20: మండలంలో కొంతకాలంగా యథేచ్ఛగా కొనసాగుతున్న మొరం అక్రమ రవాణాకు బ్రేక్‌పడింది. మండలంలోని ఫత్తేనగర్, ఫకీరాబాద్ చెరువుల్లో మొరం తవ్వకాలను అధికారులు నిలిపివేయించారు. నవీపేట మండల పరిధిలోని డబుల్ రైల్వే లైన్ నిర్మాణ పనులను టెండర్ల ద్వారా దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ ప్రజా పనుల పేరిట తూతూ మంత్రంగా అనుమతులు పొంది ఫత్తేనగర్, మైసమ్మ, ఫకీరాబాద్, నాగేపూర్ తదితర గ్రామాల్లోని చెరువుల్లో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టాడు. మొరం అక్రమ దందాపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'చెరువులను తోడేస్తున్నారు' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మెరకు ఇరిగేషన్ శాఖ అధికారులు గురువారం చెరువుల్లో మొరం తవ్వకాలను నిలిపివేయించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ బాల్‌రాం మాట్లాడుతూ.. రైల్వే పనుల నిమిత్తం చెరువుల్లో మూడు ఫీట్ల వరకు మొరం తవ్వకానికి అనుమతులు ఇస్తే, ఎక్కువ లోతువరకు తవ్వకాలు చేపడుతున్నారని తెలిపారు. చెరువుల్లో పైన ఉన్న నల్ల మట్టిని తొలగించి మూడు ఫీట్ల మొరం తవ్వకాలు చేపట్టి, తర్వాత నల్లమట్టిని పూడ్చి వేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించినట్లు చెప్పారు. మూడు ఫీట్ల కన్నా ఎక్కువ మొరం తవ్వకాలు చేపడితే సదరు కాంట్రక్టర్‌పై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. రెండు రోజుల్లో మండలంలోని పలు గ్రామాల్లో అనుమతులు ఇచ్చిన చెరువులను సందర్శించి పరిస్థితి తెలుసుకుంటామని తెలిపారు.

## అటవీ అధికారుల వేధింపులు ఆపాలి

- రూరల్ క్యాంప్ ఆఫీస్‌కు తరలివచ్చిన పట్టాదారులు
- న్యాయం చేయాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతి



రూరల్ ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

సిరికొండ, ఫిబ్రవరి 20 : అటవీ అధికారుల వేధింపులను ఆపాలని కోరుతూ సిరికొండ మండల కేంద్రానికి చెందిన పట్టాదారులు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో సీపీఐఎంఎల్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ప్రభాకర్, రాష్ట్ర నాయకుడు రామకృష్ణ మాట్లాడారు. మండల కేంద్రంలోని 532 సర్వే నంబర్‌లో 200 మంది లబ్ధిదారులకు 2009లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు చేసి ఇచ్చిందని తెలిపారు. పట్టాలు ఇచ్చాక వారి భూములను చదును చేసుకోవడానికి లబ్ధిదారులు ప్రయత్నిస్తుంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ భూముల జోలికి పోకూడదని అటవీశాఖ అధికారులను హైకోర్టు ఆదేశిస్తూ తీర్పునిచ్చిందని గుర్తుచేశారు. అయినా అటవీశాఖ అధికారుల నుంచి కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులను కూడా కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. వీరి గోడును ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. రెవెన్యూ, అటవీశాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేసినప్పటికీ ఫలితంలేదన్నారు. లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సీపీఐఎంల్ నాయకులు పిట్ల రామకృష్ణ రమేశ్, దామోదర్, బాబన్న, అనిస్, కిశోర్, నాగన్న, జాహీరబి, ఐనాలా, ముత్త, గంగవ్వ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు ముగ్గురు బలి

- తల్లిదండ్రులతోపాటు కొడుకు మృతి
- అడవిపందుల వేటకు వెళ్లి మృత్యువొడిలోకి
- బోధన్ మండలం పెగడపల్లి గ్రామశివారులో ఘటన
- స్వగ్రామం సాటాపూర్‌లో విషాదఛాయలు





మృతిచెందిన గంగారాం, బాలమణి, కిషన్ (ఫైల్)



మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 20: ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడడం బోధన్, రెంజల్ మండలాల్లో తీవ్ర విషాదం నింపింది. తల్లిదండ్రులతోపాటు కొడుకు విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడిన ఘటన బోధన్ మండలం పెగడపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. మృతులు రెంజల్ మండలం సాటాపూర్‌కు చెందినవారుకాగా..గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన గంగారాం (45)కు ఇద్దరు భార్యలు బాలమణి(40), ఎగవ్వ. వీరి కుటుంబం పందుల పెంపకంతో జీవిస్తున్నది. మొదటి భార్య బాలమణికి ఒక కొడుకు కిషన్(20), కూతురు ఉండగా ఆమెకు ఆరేండ్ల క్రితం వివాహమైంది. రెండోభార్య ఎగవ్వకు కొడుకు (10), కూతురు (8) ఉన్నారు. గురువారం తెల్లవారుజామున గంగారాం, భార్య బాలమణి, కొడుకు కిషన్ కలిసి అడవి పందుల వేట కోసం బోధన్ మండలం పెగడపల్లి గ్రామశివారులోని పంట పొలాల వద్దకు వెళ్లారు. పొలంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను గమనించకపోవడంతో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ముగ్గురూ అక్కడిక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, టౌన్ సీఐ వెంకటనారాయణ ,బోధన్ రూరల్ ఏస్సై మశ్చేందర్ కలిసి ఘటనాస్థలానికి చేరుకున్నారు. పొలంలో బురద ఉండడంతో మృతదేహాలను పోలీసులు భుజం మీద మోసుకొని బయటికి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పందుల వేట కోసం వెళ్లి చనిపోయారా? లేదా ఎందుకు వెళ్లారు? అనే విషయమై అనేక సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి.

### సాటాపూర్‌లో విషాదఛాయలు

రెంజల్, ఫిబ్రవరి 20 : మండలంలోని సాటాపూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విద్యుత్‌షాక్‌తో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు. తల్లిదండ్రులతో పాటు కొడుకు మృత్యువాత పడడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతోనే ముగ్గురు మృత్యువాత పడ్డారని మృతుల బంధువులు ఆరోపించారు.



మృతదేహాలను మోసుకువస్తున్న బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, సిబ్బంది

## మేమింతే!

**మారూటే సెపరేటు**

- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- బట్టాపూర్‌లో ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు
- పోలీసుస్టేషన్ల ముందు నుంచే వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఇసుక తవ్వకాలు చేపట్టాక వేబిల్లులు ప్రత్యక్షం!

మోర్తాడ్, ఫిబ్రవరి 20: ఇసుక దందాకు అడ్డూఅదుపులేకుండా పోయింది. యంత్రాంగం ఎన్నిసార్లు హెచ్చరించినా, చర్యలు తీసుకున్నా ఫలితంలేకుండాపోతున్నది. మేమింతే.. మా దారి సెపరేట్ అంటూ ఇసుకాసురులు రెచ్చిపోతూనే ఉన్నారు. చివరికి సీఎం హెచ్చరికలను సైతం బుట్టదాఖలు చేస్తున్నారు. మండలంలోని బట్టాపూర్ కేంద్రంగా ఇసుక అక్రమ తవ్వకాలు బుధవారం ఉదయం 7గంటల నుంచే ప్రారంభించగా.. పదిగంటలలోపే మోర్తాడ్, కమ్మర్‌పల్లి వరకు పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు చేరుకున్నాయంటే పరిస్థితి ఏమిటో అర్థమవుతున్నది. బట్టాపూర్ కేంద్రంగా ఇసుక దందాను నడిపేందుకు అధికారపార్టీకి చెందిన నాయకులు ఆరునెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం ఇసుక తవ్వకాలు ప్రారంభించగా.. పక్కనే ఉన్న వెల్కటూర్ గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఇసుక తవ్వకాలకు బ్రేక్‌పడింది. తిరిగి గురువారం ఉదయం నుంచే ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలను ప్రారంభించడం గమనార్హం.

**ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న పోలీసులు**

బట్టాపూర్ పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఆ పాటికే ఇసుక ట్రాక్టర్లు మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాలకు చేరుకున్నాయి. వేబిల్లులు ఉంటేనే ఇసుకను తీసుకెళ్లాలని పోలీసులు చెప్పడంతో హుటాహుటిన తహసీల్దార్ వద్దకు వెళ్లి 34 వేబిల్లులు తీసుకున్నట్లు సమాచారం. అయితే పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను మాత్రం సీజ్ చేయకుండానే వదిలేశారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన తర్వాత వేబిల్లులు తీసుకురావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం నుంచే పోలీస్‌స్టేషన్ల ముందునుంచే ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. సోమవారం ఇసుక అక్రమంగా తరలింపుపై పోలీసులకు ఫిర్యాదు వెళ్లడం, గురువారం వేబిల్లులు లేకుండానే ఇసుక తవ్వకాలు చేపట్టినా పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేయకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.



బట్టాపూర్ పెద్దవాగులో ఉదయం నుంచే కొనసాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు

**34 వేబిల్లులు.. 250 ట్రిప్పులు..**

ఇసుక తవ్వకాలకు 34 వేబిల్లులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ వేబిల్లులతో ఎన్ని ట్రాక్టర్లు వస్తున్నాయి, ఎన్ని ట్రిప్పులు వెళ్తున్నాయని చూడాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం పలు అనుమానాలకు దారి తీస్తున్నది. పెద్దవాగులో పక్కా ప్రణాళికతో రెండుచోట్ల ఇసుక తవ్వకాలు చేపట్టినట్లు సమాచారం. ఒకచోట అందరికీ కనిపించేలా లేబర్‌తో, మరోచోట జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. రెండుచోట్ల ఇసుక తవ్వకాలు చేపట్టారంటే ఒకేరోజు 250వరకు ట్రిప్పుల ఇసుక తవ్వకాలు జరిగినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే గ్రామకమిటీకి ట్రాక్టర్‌కు రూ.50వేలు చెల్లించిన ఇసుకాసురులు, గురువారం వాటిసంఖ్యను పెంచుకున్నట్లు తెలుస్తున్నది. వాగు నుంచి ఇసుక తీసుకెళ్తున్న ట్రిప్పుకు రూ.200 వసూలు చేసినట్లు సమాచారం. వసూలు చేసిన రూ.200 అధికారులకు మామూళ్లు ఇవ్వడం కోసమేనన్న ప్రచారం జరుగుతున్నది.

**34 వేబిల్లులు ఇచ్చాం**

ఏర్గట్ల మండలంలో బట్టాపూర్ పెద్దవాగును ప్రభుత్వ పాయింట్‌గా గుర్తించాం. ఇక్కడి నుంచి ఇసుక తవ్వకాల కోసం 34 వేబిల్లులు ఇచ్చాం. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

**- శ్రీలత, ఏర్గట్ల తహసీల్దార్**

## కామారెడ్డిలో విషాదం

### గుండెపోటుతో 'పది' విద్యార్థిని మృతి

- పాఠశాలకు నడిచివెళ్తుండగా ఘటన
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు
- స్వగ్రామం సింగరాయిపల్లిలో విషాదఛాయలు



శ్రీనిధి (ఫైల్)

కామారెడ్డి, ఫిబ్రవరి 20 : కామారెడ్డి పట్టణంలో విషాదం నెలకొన్నది. పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తుండగా పదో తరగతి విద్యార్థిని గుండెపోటుతో మృతిచెందిన ఘటన కలవరానికి గురిచేసింది. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలో గురువారం ఉదయం చోటు చేసుకున్నది. శ్రీనిధి ఆకస్మిక మృతితో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. చిన్న వయస్సులో విద్యార్థిని హఠాన్మరణం చెందడంతో స్వగ్రామం రామారెడ్డి మండలం సింగరాయిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సింగరాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీనిధి (14) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. శ్రీనిధి అప్పుడప్పుడు పట్టణంలోని కల్కినగర్‌లో ఉన్న తన పెద్దనాన్న ఇంట్లో ఉంటూ పాఠశాలకు వెళ్లి వస్తుంటుంది. ఈ క్రమంలో గురువారం ఉదయం కల్కినగర్ నుంచి పాఠశాలకు నడచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యంలో జీవదాన్ స్కూల్ వద్ద ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయింది. పాఠశాల ఉపాధ్యాయులు గమనించి వెంటనే దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ స్పందన రాకపోవడంతో మరో దవాఖానకు తరలించారు. అక్కడ ఆమెకు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యార్థిని మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. శ్రీనిధి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. విద్యార్థిని మృతికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.